నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న స్వామిజీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి భవానీ నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సుమారు 2000 మందికి ఆదివారం ఉచితంగా మాధవానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. దేవస్థానం చైర్మన్ మాధిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దర్గా ఉర్సు

శామీర్‌పేట్: శామీర్‌పేటలో జరిగిన దర్గా ఉర్సు ఉత్సవాల్లో మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేటలోని హజరత్ సయ్యద్ జలాల్ ఉద్దీన్ ముల్తాని రెహ దర్గాలో జరిగిన ఉర్సు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నేతలు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల కార్యాచరణతో 'ఒక మార్పు- అభివృద్ధి'



తడి,పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 'ఒక మార్పు-అభివృద్ధి' నినాదంతో ప్రారంభమై 14వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ నగర పాలకసంస్థలో ఉత్సవంలా కొనసాగుతుందని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ వార్డుల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వర్షపు నీరు నిలవకుండా నిరోధించడం, లోతట్టు ప్రాంతాల్లో గుంతలు పూడ్చడం తదితర పనులను చేపట్టారు. పలు కాలనీల్లో ఇంటింటికి కరపత్రాలను పంచుతూ.. తడి,పొడి చెత్తసేకరణ, వేరుచేసే విధానం, కంపోస్టుపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిప్యూటీ ఇంజినీర్ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: భూగర్భడ్రైనేజీ పనుల్లో వేగం పెంచాలని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. ఆదివారం నాచారం డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో రూ.5.50 లక్షలతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నేతలు సాయిజెన్‌శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్, యాకీ, కాలనీవాసులు రావుఫ్, శ్రీశైలం పాల్గొన్నారు.

కూచిపూడి డ్యాన్స్ క్విజ్



మౌలాలి : మౌలాలి దీన్‌దయాల్‌నగర్ మంజీర అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్, తెలంగాణ సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అకాడమీ వ్యవస్థాపకురాలు రేణుకాప్రభాకర్ నేతృత్వంలో నాట్యకేళి పేరిట కూచిపూడి డ్యాన్స్ క్విజ్‌ను మల్కాజిగిరి కల్పతరు పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ నాట్యగురువు భాగవతుల సేతురామ్, తెలంగాణ భాష సాంస్కృతికశాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, డాక్టర్ ప్రసన్నరాణిలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. క్విజ్ పోటీ విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని గోపాల్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్జీ స్కూల్‌ను కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ విద్యా బోధనలు అందించాలని స్కూల్ సిబ్బందికి సూచించారు. రావిరాజు, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రాజు, రవీందర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జనార్దన్, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి అడుగేయండి !

ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు కళాశాల విద్యే కీలకం

- చెడు మార్గానికి చెక్ పెడితేనే ప్రయోజనం
- విద్యార్థులకు కీలక సూచనలు చేస్తున్న అధ్యాపకులు



కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: కళాశాలలో అడుగు పెడుతున్నామంటే చాలు కొత్త అనుభూతి కలుగుతుంది. కొత్త మిత్రులు పరిచయమై.. స్వేచ్ఛా లోకంలోకి అడుగు పెట్టామన్న భావన విద్యార్థుల్లో కలుగుతుంది. ఈ తరుణంలో ఉన్నత లక్ష్యాలతో అడుగుపెట్టే కళాశాల విద్యే భవిష్యత్తుకు పునాది అన్న విషయం మరిచిపోవద్దని, మంచి మార్గంలో వెళ్లడానికి అధ్యాపకులు పలు సూచనలు చేస్తున్నారు.

తరచుగా పలకరిస్తుండాలి...

కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను అధ్యాపకులు తరచూ పలకరిస్తుండాలి. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాము అండగా ఉన్నామన్న భావన వారికి కలిగించాలి. చదువులో వెనకబడినప్పుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా అర్థం చేసుకునేలా శ్రద్ధ చూపించినప్పుడు వదిలేయకుండా సున్నితంగా విద్యార్థులకు ప్రేరణ కలిగించేలా వ్యవహరించాలి.

ఇతర అంశాల్లోనూ ప్రోత్సాహం..

కళాశాలలో నిర్వహించే వివిధ (సంస్కృతిక, చీఫ్ గెస్ట్ లెక్చరర్స్, వైద్య శిబిరాలు) కార్యక్రమాల్లో జూనియర్లను ప్రతిసారి భాగస్వామ్యం చేసి, ప్రోత్సహించాలి.

సోదరభావంతో మెలగాలి..

కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు అందరితో కలిసిపోయేతత్వం అవసరం. కలివిడి మనస్తత్వాన్ని పెంచుకుని స్నేహం చేస్తే అందులో ఉండే మాధుర్యాన్ని స్వాధించవచ్చు. ముఖ్యంగా నలుగురితో మాట్లాడటానికి, కలిసేందుకు ఇబ్బంది పడే విద్యార్థులు ఈ అంశంపై దృష్టిసారిస్తే కళాశాల జీవితం సాఫీగా సాగుతుంది. కళాశాలలోని సీనియర్ విద్యార్థులు మొదటిసారి కళాశాలలో అడుగుపెట్టే జూనియర్లతో సోదరభావంతో మెలిగి వారికి అండగా నిలవాలి. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి.

చెడు వ్యసనాల జోలికి వెళ్లొద్దు..

కళాశాల విద్య చదువుతున్న సమయంలోనే విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రతీ విద్యార్థి చేతిలో సెల్ ఫోన్ కనిపిస్తుంది. విద్యార్థులు దీనిని ఉపయోగకరంగా వినియోగించుకోవాలి. అలాగే దూమపానం , మత్తు పదార్థాలు తదితర అలవాట్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం విద్యార్థులపై ఓ కన్నేసి ఉంచాలి. ఏం చేస్తున్నారో ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉండాలి. చెడు వ్యసనాలకు గురైతే భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే అవకాశం ఉంది.

పక్కా ప్రణాళికతో..

ఏ రంగంలోనైనా విజయం సాధించాలన్నా పక్కా ప్రణాళిక అవసరం. ముఖ్యంగా విద్యారంగంలో ప్రణాళిక ఎంతో ముఖ్యం. దీనికితోడు గ్రహింపు శక్తి కలిగి ఉండాలి. అదే విజయానికి వజ్రాయుధంగా పనిచేస్తుంది. పాఠ్యాంశాలతో పాటు ఎదుటి వారి మంచి లక్షణాలు, అలవాట్లు, రోజూవారి కార్యక్రమాలను గ్రహిస్తే చదువుకోవడం సులభం అవుతుంది ఉత్తమంగా రాణించేందుకు ప్రణాళిక రూపొందించుకుని పక్కాగా అమలు చేయడం ప్రధానం.

అందరి సహకారం ఉండాలి



కొత్తగా కళాశాలల్లో అడుగుపెట్టే వారికి సీనియర్లు, అధ్యాపకుల సహకారం ఎంతో అవసరం. వారి ప్రోత్సాహమే జూనియర్లకు ధైర్యానిస్తుంది. అధ్యాపకులు నూతన విద్యార్థులతో స్నేహపూర్వకంగా పాఠ్యాంశాలను విద్యార్థులు అర్థం చేసుకునేలా బోధించాలి.

– దేవరాజ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, మేడ్చల్

జనావాసాల్లో శ్మశానవాటిక వద్దు !

ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీవాసుల వినతి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

పోచారం: ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని వసంతవ్యాలీ, గోకులంనగర్, వెంకటేశ్వరనగర్ కాలనీల సమీపంలో అక్రమంగా శ్మశానవాటికను కొంతమంది గ్రామప్రజలు ఏర్పాటు చేశారని ఎంపీ ఈటల రాజేందర్‌కు కాలనీవాసులు ఆదివారం ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 71, 75లోని 28 గుంటల స్థలాన్ని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైకుంఠధామంగా పేర్కొంటూ.. గ్రామస్తులు బోర్డు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం ఓపెన్ ప్లేస్‌ను పబ్లిక్ పార్కుగా మార్చాలని గత కొంతకాలంగా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. గ్రామానికి ఇప్పటికే రెండు శ్మశానవాటికలు ఉన్నాయని, వీటిలో ఒకటి 7 ఎకరాలు, మరోటి 6 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. కోర్టు ఆదేశానుసారం ఈ స్థలంలో ఎలాంటి పనులు చేపట్టకూడదని పేర్కొన్నారు. అయినప్పటికీ మృతదేహాలకు దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారని వాపోయారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి, ప్రజల ఆరోగ్యంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అక్రమంగా ఏర్పాటు చేసిన వైకుంఠధామం బోర్డు వద్ద కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. మూడు కాలనీల జాయింట్ యాక్షన్ కమిటీ కో-ఆర్డినేటర్ సోమరాజు, గోకులం కాలనీ ప్రతినిధి ఆంజనేయులు, వెంకటేశ్వరనగర్ ప్రతినిధి అజయ్‌కుమార్, పలువురు మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

విశ్రాంత ఇంజినీర్ ఉపేందర్



ఘట్‌కేసర్: రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని విశ్రాంత ఇంజినీర్ ఉపేందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వంతో కూడిన రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కిందన్నారు. నాడు బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఆయన చేసిన కృషిని గుర్తుంచుకోవాలని తెలిపారు. దాసు, నర్సింగ్‌రావు, రాందాసు, సత్యం, నాగరాజు, ఆంజనేయులు, శ్రీరామ్, గణేశ్‌గౌడ్, కృష్ణంరాజు, నిఖిల్, విష్ణు, అఖిల్, వివేక్, యాకేష్, లలిత్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీకి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

శామీర్‌పేట్: మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి దశదినకర్మకు పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాళులర్పించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం అంతాయిపల్లి పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో జరిగిన దశదినకర్మలో మంత్రి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి నివాళులర్పించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాగం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నూతన కార్యవర్గానికి నియామకపత్రాలు



నూతన కార్యవర్గంతో ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: బీజేపీ శ్రేణులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నూతన పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయగా.. ఆదివారం ఎంపీ ఈటల ఆయన నివాసంలో నియామకపత్రాలు అందజేసి అభినందించారు. మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణగౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్, సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌లు చోరీ

ఘట్‌కేసర్: మర్పల్లిగూడలో ఇంటి ముందు పార్క్ చేసిన రెండు బైక్‌లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్పల్లిగూడకు చెందిన సురేష్ ఇంటి ముందు తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి నిద్రకు ఉపక్రమించాడు. అలాగే నీలం దామోదర్ కూడా తన వాహనాన్ని ఇంటి ముందే పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందున్న వాహనాలు కనిపించలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గోరక్షక్‌పై దాడి.. కేసు నమోదు

మల్కాజిగిరి: గోవుల తరలింపుపై పోలీసులకు సమాచారం అందించాడని గోరక్షక్ పై దాడి చేసిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బీజేఆర్‌నగర్‌కు చెందిన వంశీకృష్ణ(28) ప్రైవేట్ ఉద్యోగి. ఈనెల 8న గోవులను తరలిస్తున్నారనే సమాచారాన్ని పోలీసులకు ఇచ్చాడు. దీంతో కొందరు ఆదివారం మధ్యాహ్నం ఇంటి ముందున్న అతడిపై కొందరు దాడికి పాల్పడ్డారు. దీంతో మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

విద్యార్థి అదృశ్యం



ఇస్లావత్ రాహుల్

ఘట్‌కేసర్: తల్లిదండ్రులు మందలించినందుకు ఓ బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా పాలకుర్తికి చెందిన ఇస్లావత్ రాహుల్ (21) ఘట్‌కేసర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటూ.. ఓ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాగా శనివారం మధ్యాహ్నం స్నేహితులకు చెప్పకుండా గది నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బంధువులు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రధాని నాయకత్వంలోనే దేశాభివృద్ధి'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

జవహర్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని బీజేపీ జవహర్‌నగర్ కార్పొరేషన్ ఈస్ట్ అధ్యక్షులు జోగారావు అన్నారు. మోదీ పాలనలో దేశాభివృద్ధిని వివరిస్తూ.. ఆదివారం జవహర్‌నగర్ బీజేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలోనే దేశం సుసంపన్నమైందని, రైతులను రాజుగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, యాదగిరి, వెంకన్న, అనిల్‌గుప్తా, శ్రీధర్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ కోదండరాం, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు అన్నారు. ఆదివారం నాచారం హెచ్ఎంటీనగర్ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14వ ప్రపంచ వయోధికుల వేధింపుల అవగాహనసభ, వేధింపుల నివారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వయోవృద్ధుల రాయితీల సాధనకు సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తామని వివరించారు. రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు నరసింహ, మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి, సాయిజెన్‌శేఖర్, ప్రొఫెసర్ చెన్నప్ప, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలను సాకారం చేద్దాం



బోడుప్పల్: అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేద్దామని అంబేడ్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి 330వ జ్ఞానమాలను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోచారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో యానంపేట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అమానుషమన్నారు. విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకుని దుండగలను కఠినంగా శిక్షించాలన్నారు. భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, యాకయ్య, చిల్ల అంజయ్య, బండారి సాయి, ఏసురాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ హితానికి అమ్మ పేరున మొక్క నాటాలి



మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరి హనుమాన్ వ్యాయామశాల ఆవరణలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మండలి సునీల్‌యాదవ్ ఆధ్వర్యంలో 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్, సునీల్‌యాదవ్‌లు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ అమ్మ పేరున మొక్క నాటాలని సూచించారు. శ్రీనివాస్, నాగరాజు, జయకృష్ణ, పవన్, అభిషేక్, తేజ, హనుమాన్, వినోద్ తదితరులున్నారు.

పూడిక మట్టిని తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



పూడిక తొలగించిన తర్వాత

మల్కాజిగిరి: 'పూడిక తీశారు.. మరిచారు' శీర్షికన ప్రచురించిన వార్తకు జలమండలి అధికారులు స్పందించారు. మల్కాజిగిరి ఎస్పీనగర్‌లో మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన పూడికపై సాక్షిలో వార్త ప్రచురితమైంది. ఆదివారం పూడికను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కాలనీలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ మురుగేష్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ వసంత్‌విహార్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ మురుగేష్ అన్నారు. ఆదివారం కాలనీలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని కొన్ని రోడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుందని తెలిపారన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సహకారంతో గతంలో మొబైల్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో సామర్థ్యం పెంచి ప్లింత్ మౌంటెడ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కుమ్మరికృష్ణ, నవీన్, పటేల్, రమాకాంత్, నాయకులు ఇబ్రహీం, జంగరాజు, వెంకటేష్, శ్రీకాంత్, చందు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో తమ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు డోలి రమేష్, లక్ష్మణ్‌యాదవ్, పవన్, ప్రశాంత్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సతీష్, కాలనీవాసులు అభిషేక్, సత్యనారాయణ, రవికుమార్, కృష్ణచైతన్య, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



బీజేపీ నేతలను సత్కరిస్తున్న దృశ్యం

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మేడ్చల్ జిల్లా బీజేపీ కౌన్సిల్ మెంబర్ రవీంద్రసాగర్ అన్నారు. బీజేపీ పార్టీ మల్లాపూర్ డివిజన్ ఉపాధ్యక్షులుగా రామయ్య, కార్యదర్శి వేముల రమేష్‌లను ఆదివారం బీజేపీ నేతలు సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్‌సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే దిశగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కాలనీ అధ్యక్షుడు పరమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి బుచ్చన్నసాగర్, సలహాదారులు ధనుంజయ, రమేష్, మధుసూదన్‌రెడ్డి, రమేష్, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు.. చింతలు !



బోడుప్పల్: బోడుప్పల్ నుంచి అయ్యప్పస్వామి ఆలయానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. శ్రీనివాస్‌నగర్ ప్రధాన రహదారికి గుంతలు పడటంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో వాహనాలు అదుపుతప్పి కింద పడిపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.